ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక: 23-11-1978

# దొంగ

వెంకటస్వామికి, కాళ్ళు లాగుతున్నాయి! అయినా డ్యూటీ చెయ్యక తప్పదు గనుక చేస్తున్నాడు. అందునా రాత్రిపూట డ్యూటీ! పెద్ద వయస్సు! దానికి తోడు అస్తమా వుంది. ఇవన్నీ కలసి, అర్ధరాత్రి నడిరోడ్డు మీద నిలబడ్డ వెంకటస్వామికి గుర్తొచ్చి, 'ఛీ! యదవ బ్రతుకు' అనిపించాయి.

నడుం మీద చేతులు పెట్టుకుని, ఆకాశం వేపు చూసి 'యదవది వాన గూడ వస్తే, ఈ రాత్రికి మన పని ఖాళీ! ఛస్తే, రేపటికి రెండు' అని కూడ అనిపించాయి.

ఓ సిగరెట్టు ముట్టించుకుని, గట్టిగా పొగ పీల్చి నడక సాగించాడు వెంకటస్వామి.

రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి. వుండీ వుండీ వీచే ఈదురు గాలికి కాగితాలు, చెత్త, దుమ్ము ఎగిరొచ్చి పడుతున్నాయి.

ఊళ్ళో దొంగల భయం ఎక్కువైంది. అందుకని ప్రభుత్వం, గస్తీ ఏర్పాటు చేసింది. అయినా దొంగతనాలు జరుగుతూనే వున్నాయి. దొంగతనం జరిగిన ప్రాంతంలో గస్తీ తిరిగిన పోలీసులకు తిట్లు, చివాట్లు, హెచ్చరికలు, మెమోలు ఇస్తున్నారు.

"యదవనాకొడుకులు, దొరికితే బావుణ్ణు. నా కొడుకుల్ని చితకబాద్దును" అనుకున్నాడు వెంకటస్వామి.

కాళ్ళీడ్చుకుంటూ నడిచి, డ్యూటీ మీద కోపం, చిరాకు కలిగి - 'దీనెమ్మ నాయాల్ది పోతే పోతది ఉద్యోగం' అని నిశ్చయానికొచ్చి, వెంకటస్వామి, ఓ కొట్టు అరుగు మీద చతికిలబడ్డాడు. టోపీ తీసి అరుగు మీద పెట్టి, లాఠీ దాని ప్రక్కన బెట్టి, తలుపు కాను

కున్నాడు. అయినా కాళ్ళు లాగుతున్నాయి. అప్పుడు గుర్తుకొచ్చింది. తన కాళ్ళకు నాడాలు కొట్టిన బూట్లున్నాయని. వెంటనే విప్పేసి, 'అమ్మయ్య' అనుకుని, గోడ ప్రక్కగా జరిగి, కాళ్ళు చాచుకుంటే, ప్రాణం లేచొచ్చింది!

వెంకటస్వామి చేరిన క్రొత్తలో, పోలీసంటే గౌరవముంది. దొంగనాయాళ్ళు, భయం నటించి, ప్రక్కల కెళ్ళేవాళ్ళు. కొట్లల్లో, తదితరచోట్ల, మర్యాద, మన్ననేగాక, ధరలో గూడ రాయితీ ఇచ్చేవాళ్ళు. నెల నెలా వచ్చే మామూళ్ళు, పండుగల కొచ్చే బక్షీస్‌తోటి, ఉద్యోగం పాడి ఆవులా ఉండేది.

అందుకే, ఆ రోజుల్లో వెంకటస్వామి నల్లని పోతపోసిన వీరభద్రుడి లాంటి శరీరాన్ని చూసి, మోజుపడి ఓ పిల్ల ప్రేమించింది గూడ. అయితే ఆ రోజుల్లో, ఎంత పోలీసైనా, తండ్రి మాటంటే భయం వుండడం వల్ల, వెంకటస్వామి, సాహసించలేకపొయ్యాడు. ఆ పిల్ల వేరేవాళ్ళను మనువాడి వెళ్ళిపోయింది.

వెంకటస్వామికి గతం గుర్తొచ్చి హుషారొచ్చింది.

"ఆ పిల్ల యాడుందో, మళ్ళీ కంటబడలా!" అనుకున్నాడు.

ఈపాటికి, ముసల్ది అయిపోయివుండొచ్చు. జుట్టు నెరసి, కళ్ళ క్రింద నల్లగా నీఢలు వచ్చి వుంటాయి. తెల్లటి పళ్ళు వూడి, నవ్వితే ఇప్పుడెలా వుందో! పిల్లలెంత మందో? ఏ వూళ్ళో వుందో? తన్ను చూసి గుర్తు పడుతుందో లేదో?

ఇలా, ఆ పిల్లను గురించి, ఊహాగానాలు చేస్తూ కూర్చున్నాడు వెంకటస్వామి.

ఓ యింట్లో నుంచి, గడియారం గంటలు కొట్టింది. చెవొగ్గి విన్నా ఎన్ని గంటలు కొట్టిందో వెంకటస్వామికి వినపడలా! 'వెధవది! ఈ చెవుకేం వచ్చిందో?' అనుకున్నాడు. చెవి వినపడనందుకు తిట్టుకున్నాడు. ఆ చెవే బాగుంటే, ఈ అర్థరాత్రి రోడ్ల మీద పడి తిరిగే తిప్పలుండేవి గావు. హాయిగా, స్టేషన్‌లో కూర్చుని నిద్ర పోతుండేవాడు. ఫోన్లో చెప్పేది వినపడదని సర్కిల్ తీసి రోడ్డు మీద గిరవాటేశాడు. ఎంత వేడుకున్నా, ఊహు! వినందే!

వెంకటస్వామికి, సర్కిల్ గుర్తొచ్చి, డ్యూటీ జ్ఞాపకం వచ్చి, టోపీ పెట్టుకుని, కర్ర తీసుకున్నాడు. ఇలా తను ఓ అరుగు మీద కూర్చున్నట్లు తెలిస్తే సర్కిల్ వూరుకోవటం అలా వుంచి, తిట్టిన తిట్టు తిట్టకుండా, పురాణంలా చదువుతాడు. అంతేగాదు... ఇంతలో...

"దొంగ! దొంగ!"

కేకలు వినపడ్డాయి.

వెంకటస్వామి కళ్ళు చికిలించి చూశాడు. చెవొగ్గి విన్నాడు. కానైతే ఏం లాభం! ఆ కేక లెటునుంచి వచ్చాయో పోల్చుకోలేకపోయాడు.

ఇంతలో ఎవడో పరుగెడుతున్నాడు.

"అమ్మనాకొడకా! దొరికిపొయ్యాడు", అనుకుని బెల్టు సవరించుకుని, దొంగనెలా

కథా నిలయం
5763
శ్రీకాకుళం

పట్టుకోవాలా అని ఆలోచించసాగాడు.

జనం కేకలు ఎక్కువైనాయి.

పరుగెత్తుకొచ్చిన వాడు, వెంకటస్వామిని చూసి, నడిచి వచ్చి, "ఎక్కడా దొంగ?" అని అడిగాడు.

వెంకటస్వామి, అడిగినవాడు దొంగా, లేక వేరే దొంగ వున్నాడా అని నిర్ధారించుకునే లోపల, "దొంగ దొంగ అంటే పరుగెత్తుకొచ్చాను. ఎవరూ లేరు. అయినా ఈ సందులో కెళ్ళి చూస్తాను" అని వచ్చినవాడు సందులో కెళ్ళిపోయాడు.

'ఏందబ్బా, మాయగా వుందే' అనుకుని బూట్లు కాళ్ళకు తగిలించుకునే లోపల జనం కర్రలు, బ్యాటరీ లైట్లు, పుచ్చుకు పరుగెత్తుకొచ్చారు. వెంకటస్వామిని చూసి జనంలో ఓ కుర్రాడు, "యిటొచ్చిన మనిషేడీ?" అని అడిగాడు. జనం వెంకటస్వామినే చూస్తున్నారు ఆత్రుతగా.

కుర్రాడు, అడిగిన ప్రశ్నకు, తను సమాధానం చెబుదామా, వద్దా అనే నిర్ణయం తీసుకునే లోపల, "ఏందహే! అట్లా చూస్తావ్!" అని కసురుకున్నాడు ఒకడు.

వెంకటస్వామికి అరికాలిమంట నెత్తి కొచ్చింది 'యదవ నా కొడుకులు! పోలీసంటే భయమే లేదు' అనుకుని టోపీ సవరించుకుని, "దొంగా! ఎక్కడా?" అని ఎదురు ప్రశ్న వేశాడు జనాన్ని.

జనం కాసేపు వెంకటస్వామిని, వెర్రి జంతువులా చూసి, "ఈడెవడ్రా? మనల్ని దొంగెక్కడ అని అడుగుతాడు" అని ఎవరో అంటే ఫక్కున నవ్వారు. ఆ నవ్వు, వెంకటస్వామికి పుండు మీద కారం చల్లినట్లుంది. విజిల్ తీసుకు గట్టిగా వూది, మొహంలో గాంభీర్యం తెచ్చుకుని, "నూటనలభైనాలుగుంది. ఇంతమంది తిరగ్గూడదు. ఎల్లండి- దొంగ కనబడితే నేపట్టుకుంటాను" అన్నాడు.

వెంకటస్వామి గొంతు విని జనం నవ్వారు. ఎందుకు వాళ్ళు పగలబడి నవ్వుతున్నారో వెంకటస్వామికి అర్థం కాలేదు.

"పోలీసోళ్ళు, దొంగలు లాలూచెహే!" అని ఒకడు అన్నాడు.

తలోవిధంగా మాట్లాడుకుంటూ జనం వెళ్ళారు.

వెంకటస్వామికి, వాళ్ళు వెళ్ళాక గుండె దడ తగ్గింది. గాలి అసలు లేక చెమటపట్టింది. ఆకాశం వేపు చూశాడు. మబ్బులు క్రమ్ముకుంటున్నాయి.

చేసిన డ్యూటీ చాలు, ఇంక కొంపకు పోదాం అని నిశ్చయించుకుని బయలు దేరాడు.

ఇనపకాళ్ళ క్రింద పడి చిన్న చిన్న రాళ్ళు, ఇసుక రైలు క్రింద పడ్డ మనుషుల్లా అరుస్తున్నాయి. కుక్క ఓ చెత్తకుండీ ప్రక్కన పడుకుని, ఎముకను కట్ కటాని కొరుకుతూంది. వెంకటస్వామిని చూసి, గుర్రుగా అరచి, 'భౌ' అంది. వెంకటస్వామికి కుక్కంటే బెదురు. ఓసారి డియస్పీగారింటికెడితే, ఆయన పెంపుడుకుక్క, పులిలాగా వుంది,

గబుక్కున వచ్చి కాలు పట్టేసింది. కదలటానికి లేదు. కేకేసి పిలుద్దామంటే, గొంతులోంచి మాట రాదు. ఆ యింట్లోంచి కూడ ఎవరూ రాలేదు. ప్రాణాలుగ్గబట్టుకొని అలాగే నిలబడి పోయిన వెంకటస్వామి వంట్లోంచి నెత్తురంతా చెమట రూపంలో బయట కొచ్చింది. వేసుకున్న యూనిఫారం తడిసిపోయింది. అలా సజీవ సమాధిలోనే 'హరీ' అనాలని వ్రాసి పెట్టాడేమో భగవంతుడు అని ఆ రోజు వెంకటస్వామి అనుకున్నాడు.

కొంతసేపటికి బయటకు వచ్చిన డియస్పీగారు వెంకటస్వామిని చూసి, 'బులెట్' అని కుక్కను పిల్చారు. పులి నాకి వదిలిన వెంకటస్వామి, తనొచ్చిన పని మరిచి, ఆయన్ని చూచి 'బా' అన్నాడు. ఆయనగారు బులెట్‌ని దువ్వుతూ వెంకటస్వామిని తిట్టారు. "ఏను బోతులా వున్నావు. కుక్కను విడిపించుకోలేవా? నీలాంటోళ్ళు వుండబట్టే, డిపార్ట్‌మెంట్ పరువుపోతున్నది. జిడ్డు మొహం నువ్వు" అని ఉపన్యాసం ఇచ్చారు.

కుక్కనీ, డియస్పీని తప్పించుకు స్టేషన్‌కు వెడితే, యస్.ఐ.గారు వెళ్ళినపని చేసుకు రాకుండా వచ్చినందుకు లాఠీచార్జీ చేసినంత పని చేశాడు.

వెంకటస్వామికి, అప్పట్నుంచీ కుక్కంటే భయం.

సి.ఆర్.పి.వాళ్ళు, సిమెంటు రోడ్డు మీద కవాతు చేస్తున్నట్లు వానొచ్చింది.

లేని సత్తువతో, కాళ్ళు లాగుతున్నా, ఏ చూరు క్రిందన్నా దూరుదామని చూశాడు. ఓ చోట కెడితే రెండు కుక్కలు సరాగాలాడుకుంటున్నాయి. మరోచోట గాడిద నిలబడి వుంది. ఇలా సరైన చోటు కోసం వెతికేసరికి గుడ్డలు తడిసి, వంట్లోంచి వణుకొచ్చింది. వాననీ, డ్యూటీనీ, దొంగల్నీ కలిపి తిట్టి - పరుగెత్తుకుంటూ వెళ్ళి ఓ పెంకుటింటి చూరు క్రింద నిలబడ్డాడు. పైన పెంకులు లేక, చూరుబద్దల్లోంచి నీళ్ళు ధారగా పడ సాగాయి. అటు జరిగి ఇటు జరిగి, ఓ మూలకు చేరితే, అక్కడో ముష్టోడున్నాడు పడుకుని.

మెరుపు మెరిసింది. కళ్ళు మూసుకున్నాడు వెంకటస్వామి క్షణం. మళ్ళీ కళ్ళు తెరిస్తే తను నిలబడ్డచోట వెనకగా కిటికీ వుంది. ఊరికే లోపలకు చూశాడు. ఓ మంచం, రెండు ఆకారాలు నాగుపాముల్లా మెలేసుకుని వున్నాయి.

వెంకటస్వామికి పళ్ళు పులిశాయి. ఆ వెంటనే వున్న నాలుగు దంతాలు, జివ్వుమని లాగాయి.

మంగమ్మ గుర్తొచ్చింది.

పెళ్ళయిన క్రొత్తల్లో, డ్యూటీ అవటం ఆలశ్యం, మామూళ్ళ మాట గూడ మర్చిపోయి, యింటికెళ్ళి మంగమ్మ దగ్గర కూర్చుండేవాడు. నల్లగా వున్నా మంగమ్మది గట్టి వళ్ళు, పదేళ్ళు కాపురం చేసినా, మంగమ్మ, క్రొత్త పెళ్ళికూతురు లాగానే, కనుపించేది వెంకట స్వామికి. ఎనుబోతంత వెంకటస్వామి, మంగమ్మ ముందర జావలాగయ్యేవాడు. మంగమ్మ, వెంకటస్వామిని చూసి, అదోరకంగా నవ్వేది. ఆ నవ్వు బుల్లెట్‌లా గుండెల్లో

గుచ్చుకునేది. ఎంత పౌరుషం, శక్తీ తెచ్చుకున్నా వెంకటస్వామికి ఓటమి తప్పలేదు.

అఖరికి, మంగమ్మ పిల్లల్లేకుండానే కాలం చేసింది. మంగమ్మ పొయ్యేసరికి, వెంకటస్వామి హెడ్డయ్యాడు. వంట్లో సత్తువ చచ్చింది. కంటికి చూపు తగ్గింది. నల్లని క్రాపు పోయి, తల చవిటి పర్రలాగా అయింది.

గతం గుర్తుకొచ్చి, వెంకటస్వామికి నిస్సత్తువ వచ్చింది. సిగరెట్ తీసి వెలిగించుకుందామంటే, అగ్గిపెట్టె తడిసి మండలేదు. వాన తగ్గలేదు.

ఎక్కడా నరసంచారం లేదు. వానకు గాలి తోడురాగా, ఆ రాత్రి, వూరంతా, వానలో తడిసి, క్రొత్త పెళ్ళికూతుర్లా, అలసి సొలసి నిద్రలో మైకంలో వుంది.

మూలగా పడుకున్న ముష్టోడు గుర్తుకొచ్చి, లాఠీతో వాడి గుండెల మీద కొట్టి, "ఒరేయ్! అగ్గివుందా" అనడిగాడు వెంకటస్వామి.

ఈదురు గాలి, వాన, ఆ పైన పోలీసునీ చూసి ముష్టోడు, "లేదుబాబూ" అన్నాడు వినయంగా. వెంకటస్వామికి బ్లడ్ ప్రెషరుంది. దాంతోపాటు కోపం, లాగి బూటు కాలితో, ముష్టోణ్ణి తన్ని, "లంజకొడకా! అగ్గిపెట్టెన్నా లేకుండా ఈడెందుకురా! లెగహే" అని ఉరిమినట్లు అరిచాడు.

ముష్టోడు, తిన్న బూటు దెబ్బకో, పోలీసు వెంకటస్వామి ఆకారానికో, భయపడి, గిన్నె, డబ్బా, పాతగుడ్డల మూటతో, చీకట్లోకి పరుగెత్తాడు.

మెరుపు మెరిసింది. కిటికీలో సర్పాలు, యింకా పట్టు విడవలేదు. వాన తగ్గలేదు. వెంకటస్వామికి, పార్వతి గుర్తుకొచ్చింది.

పార్వతి ఏం చేస్తుంటుందో ఈ సమయంలో.

వెంకటస్వామికి మంగమ్మ పోయాక, బ్రతుకులో సుఖం లేకపోయింది. తిండి సుఖం, పడక సుఖం లేక ఏనుగంత మనిషీ ఎలుకలాగయ్యాడు. విధవప్పగారొచ్చి కొన్నాళ్ళు వుండి ఉడకేసిపెట్టింది. ఆమె చేసే వంటకాలు వెంకటస్వామికి వంటబట్టలేదు. ఉప్పులు, కారాలు మసాలాలు, అన్నిటా ఆవిడ చేతివాటం వేరవటంతో వేళకింత తిన్నా, వెంకటస్వామి పుంజుకోలేదు. అఖరికి, ఆవిడకూ విసుగొచ్చి, "ఒరేయ్ వెంకటీ! నీకు జీవితాంతం ఉండి ఉడకేసి పెట్టడం నా వల్లగాదు గానీ, దేని మెళ్ళోనన్న మళ్ళీ తాళి కట్టు" అంది.

వెంకటస్వామికి ఆ మాటలకు 'ఊఁ! ఆఁ!' అనలేదు. పళ్ళూడిపోతున్న వయసులో మళ్ళీ పెళ్ళి ఆలోచన అతనికి గతంలో వచ్చినా, దాన్ని కొనసాగనీయలేదు. పిల్లనివ్వరన్న భయం కాకపోయినా, ఆ వచ్చే పిల్ల, మంగమ్మ స్థానంలో వుండి, తనను కడతేరుస్తుందా అని అనుమానం.

వెంకటస్వామి విధవప్పగారే, సంబంధం చూసి, ఓ రోజు గుళ్ళో పార్వతిని వెంకటస్వామి కప్పజెప్పి వెళ్ళిపోయింది.

పార్వతి, వచ్చిన క్రొత్తల్లో కాపురానికి, పాల నక్కోరుబోయిన అవుదూడలా వుండేది.

ఎండిన బుగ్గలు, ఎదగని అవయవాలతో, కోరికకూ, శరీరంలోని వోపికకు, పొంతన లేక, వెంకటస్వామి, పగలు స్టేషన్‌లోనూ, రాత్రిళ్ళు యింటి ముందర వసారాలోనూ గడపసాగాడు.

వాన తగ్గింది కానీ, గాలి తగ్గలేదు. కరెంటు దీపాలు లేక, సమాధుల్లో నడుస్తున్నట్లు వుంది వెంకటస్వామికి. నీళ్ళెక్కడో, గొయ్యెక్కడో తెలియక మెరుపు వెలుగులో దారి ఆనవాలు బట్టుకుని, యింటికి మళ్లాడు వెంకటస్వామి.

చల్లటి గాలి, కిటికీలో కనుపించిన నాగబంధం వెంకటస్వామి గుండెల్లో చితి రాజేసినాయి. పోగా, అమాయకపు కళ్ళల్లో, శాణీతనం, ఏపుగా పెరిగి, ఎత్తుపల్లాలు పొందికగా అమరి, క్రొత్తనీరు వంటబట్టిన పార్వతి, వెంకటస్వామి కళ్ళల్లో కదలాడి, 'దీనెమ్మ నాయాల్డి! దొంగోళ్ళు లేకపోతే, పోలీసులకు విలువ లేదు, పోలీసులు లేకపోతే దొంగలకు భయం లేదు, కనుక ఎందుకొచ్చిన చావు! యింటికెళ్ళి, వెచ్చగా పడుకుంటే, అదే డ్యూటీ' అనుకున్నాడు.

నీళ్ళు పొయ్యే దారి లేక, బజార్లల్లో నిలబడ్డాయి. తూముల్లోంచి, గొట్టాల్లోంచి నీళ్ళు క్రొత్త పెళ్ళికూతురిలా దూకుతున్నాయి భూమ్మీదకు. వానకు తడిసిన భూమి, ఇళ్ళు క్రొత్త వాసనలతో మత్తెక్కిస్తున్నాయి. బృందగానంలా గోండ్రుకప్పలు, భజన చేస్తున్నాయి. తూర్పున ఎవర్నో మర్డర్ చేసినట్లు, ఎర్రగా వుంది.

వెంకటస్వామికి హుషారొచ్చింది. కాళ్ళ తీపులు తగ్గాయి! వంట్లో రక్తం వేడెక్కి పరుగులు తీయసాగింది. చాలా రోజుల తర్వాత, ఈల వెయ్యాలని అనిపించింది.

ఇంట్లోకి అడుగు పెడుతూ, వీధి తులుపు తెరిచి వుండడం చూశాడు.

'పిల్ల ముండకు నిద్రొచ్చి, నేనెంతకూ రాకపొయ్యేసరికి, అట్లానే నిద్రపోయుంటుంది' అనుకున్నాడు వెంకటస్వామి.

తలుపు తెరిచి చూశాడు.

వెంకటస్వామికి, కాళ్ళు నొప్పులెట్టాయి.

గుండెల్లో, ఆస్తమా మేల్కొని గుర గురలాడింది.

చల్లగాలి వీస్తున్నా, చెమట పట్టింది.

వేద్దామనుకున్న ఈల, గొంతులోంచి బయటకు రాలేదు.

వరండాలో చతికిలబడ్డాడు వెంకటస్వామి, నీరసం ముంచుకొచ్చి!

పార్వతి, ప్రక్కలో వున్న 'దొంగ' ఎవడా అని ఆలోచించసాగాడు, వెంకటస్వామి.

♦ ♦ ♦

ఊళ్ళో దొంగతనాలు తగ్గాయి; వెంకటస్వామికి, నైట్‌డ్యూటీ తప్పింది.

వెంకటస్వామి, వరండాలోనే పడుకుంటున్నాడు - రాత్రిళ్ళు - దొంగను పట్టుకోవటమా, మానటమా అని ఆలోచిస్తూ. ●